
# మొదలూ - చివర



'లలిత యిట్లా చేస్తుందని కలలోనైనా అనుకోలేదు'

'లలిత యిట్లా చెయ్యడంలో అర్థంలేదు'.



'లలిత యిట్లా ఎందుకు చేసిందో బుర్ర గోక్కున్నా నాకర్థంకావడంలేదు'.

'లలిత యిట్లా ఎందుకు చేసింది చెప్మా'

అంటూ ఎవరికి తోచినట్లుగా వాళ్ళు తమ అభిప్రాయాన్ని ప్రకటించారు బహిరంగంగా.

'చంద్రం అటువంటి వాడు కాడే'

'చంద్రం మనస్తత్వం నాకు బాగా తెలుసు అతనిట్లా చేస్తాడంటే నేను నమ్మలేకుండా ఉన్నాను'

'అసలు చంద్రం యిట్లా చేసాడెందు కంట ?'

'చచ్చినా బోధపడటం లేదు సుమీ, చంద్రమే యీ పని చేసాడంటే'

ఇటూ కూడా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు మొగమాట పడకుండా

ఈ బహిరంగ భావ ప్రకటనలన్నీ వాళ్ళిద్దరి సంసారిక జీవితం ఆనాటి కోర్టు ప్రకటనతో ఆఖరయిపోతోందని.

'వాళ్ళిద్దరి మధ్యనా ఒక్కనలుసుంటే యీ అఘాయిత్యం జరుగునా అంట ?'

'అసలు చెట్టాపట్టాలు పట్టుకుని ముసిముసి నవ్వులు నవ్వుతూ తిరిగే వాళ్ళ సంగతి మాకు తెలియదా అంట ? మొదట్లో ఎకసక్కాలూ, తర్వాత రుసరుసలూను'

'మన వాళ్ళు ఊరికే చెప్పారా ...'

---

మురళీధర్

---

'.... నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి...'

అంటూ తోచీ తోచని కారణాలు వల్లించారు వాళ్ళంతా

కోర్టువారు విడాకులిచ్చే ముందర కొంతకాలం యిద్దరూ వేరుండేందుకు గాను అనుమతించడం ఆచారం ఆ కాల పరిమితి తీరిపోగానే భార్యా భర్తలకు యింకా విడిపోవాలని ఉంటే విడాకులిచ్చేస్తారు కాని కొందరు యీ కాలంలో రాజీకి గూడా వస్తూ ఉంటారు

దసరా మరో రోజు ఉందనగా కోర్టువారు లలితా చంద్రం పెట్టుకున్న విడాకుల దరఖాస్తు చూసి, లాంఛన ప్రాయంగా అడగవలసిన ప్రశ్నలు అడిగి, వేరే ఉండటానికి అనుమతించారు

అవాళ కోర్టు నుంచి బయటకు వస్తూ లలిత అన్నది 'మనం విడిపోతున్నా యివాళనుంచి' అని

'మనం విడిపోయాం యిప్పటినుంచి' అని రెట్టించాడు చంద్రం

ఇద్దరూ చెరో వైపూ వెళ్ళిపోయారు రిక్షా లెక్కి

* * *

## 2

లలితా చంద్రం యిద్దరూ ఇంగ్లీషు ఆనర్సులో కాలేజి మేట్స్. ఇద్దరూ బహిరంగంగా ప్రేమించుకుని, బాహాటంగా దాన్ని వప్పుకుని, తల్లితండ్రుల్ని ఒప్పించి, సాధించారు.

ఆవాళ కాలేజీ వార్షికోత్సవం. లలిత ఆ సంవత్సరం కాలేజి యూనియన్ ప్రెసిడెంటు. అమ్మాయి ప్రెసిడెంటు కావడంవల్ల అందరూ అల్లరి చేసి దింపాలని చూశారు. కాని లలిత ఎట్లాగో నెగ్గుకొచ్చింది. చంద్రం సెక్రటరీ ఆ సంవత్సరం మొదట్లో ప్రతిదానికీ అడ్డు తగులుతూ ఏ కార్యక్రమాన్నీ జరగనియ్యకుండా చేసినా రాను రాను లలిత సౌమ్యత, కలుపుగోలుతనం పూర్తిగా మార్చేసింది చంద్రాన్ని అందువలన సంవత్సరం పూర్తి అయ్యేసరికి లలిత పైన గౌరవమూ, అభిమానమూ పెరిగాయి లలిత అవాళ నిజంగా చాలా ఆకర్షనీయంగా కనిపించింది చంద్రం కళ్ళకు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుని 'యీ వ్యక్తితో తను యింత కాలంబట్టీ ఎట్లా దెబ్బలాడానా' అని అనుకొన్నాడు. వార్షికోత్సవం అయిపోయింది. చంద్రం లలితా మరీ దగ్గరకొచ్చారు సెలవల్లో రెండవ సంవత్సరమంతా వాళ్ళ స్నేహానికి ఒక స్వరూపం వచ్చింది మూడో సంవత్సరం పూర్తయ్యేసరికల్లా అదే ప్రేమగా మారి వివాహానికి దారితీసింది.

ఈ విధంగా విశ్వవిద్యాలయ పట్టభద్రత్వం, జీవితపు తొలి వసంతంలోనే చిగిర్చిన ప్రేమా, ఒకదానికొకటి

పెనవేసుకునిపోయి వాళ్ళను బంధించి వేశాయి.

విశాఖపట్టణంలోనే యిద్దరికీ ఒకే కాలేజీలో కాకపోయినా ఒకే ఊళ్ళో లెక్చరర్ ఉద్యోగాలు వచ్చేశాయి బంగారానికి మెరుగు పెట్టినట్లుగా వెలిగి పోతుంది అంతా.

అంతవరకూ బాగానే ఉంది అంతా కాని అక్కడే ఆగిపోలేదు ఆగిపోయి ఉంటే యీ కథ అక్కడితో ఆగి పోయేది.

లక్షణంగా వీళ్ళిద్దరూ పెళ్ళిచేసుకున్న తర్వాత డాబాగార్డెన్స్‌లో కాపురం పెట్టారు ఒక ఏడాదిపాటు వచ్చేపోయే స్నేహితులతో, అభినందించే వాళ్ళతో నిండిపోయాయి వాళ్ళ సాయంత్రాలన్నీ

ఇట్లా ఉండే సమయంలో చంద్రం వాళ్ళ మామయ్య సోమశేఖరరావుగారు యింట్లోకి అవతరించాడు సోమశేఖర రావు ఖాళీ అయిపోయిన అగ్రహారీకుడు ఆస్తి హారతికర్పూరం లాగ హరించి పోయి, పరువనే బూజు వంటినిండా పట్టి, కొంతకాలానికి అదీ వదిలిపోయి, మార్కెట్టులో మారక, ఆ పంచా యీ పంచా పట్టుకుని పాకులాడుతున్నాడు మేనల్లుడు చంద్రం ప్రయోజకుడు అయినాడని తెలియగానే విశాఖపట్టణం వచ్చి వాలాడు రాజమండ్రి నుంచి.

సోమశేఖరరావుగారు వస్తూనే హంగామాగా వచ్చారు వెంట మూడు



"ఇప్పుడైనా నమ్ముతారా నామాట ? అష్టగ్రహకూటాలూ గీటాలు, వాటి ఉపద్రవాలూ మొదలైన హంగామా అంతా కొందరు స్వార్థపరులు, మూఢులు సాగించిన దుష్ప్రచారమని "

"లేదు — వాటిమీద నమ్మకం యింకా గాఢంగా కుదురుకుంది, జల ప్రళయానికి జడిసి కోస్తా ఊళ్ళనించి మా అల్లుడితో నలుగురు మా అత్తగారితో మరో నలుగురు మొత్తం ఎనమండుగురు నష్టగ్రహాలు నా ఇంట్లోకి వచ్చిపడి యింకా అలాగే తిష్ఠవేసి ఉన్నారు, ఇపుడు నేను ఘోరమైన ఆర్థిక ప్రళయంలో ఈదులాడు తున్నాను."

---

పెట్టెలూ, బెడ్డింగూ, ఫ్లాస్కూ, యివన్నీ చూస్తే నాలుగు రోజులు ఉండి, పోయేలాగ కనిపించలేదు పెద్ద ప్రణాళిక వేసుకుని వచ్చినట్లు తెలుస్తూనే ఉంది

కొత్తగా బంధువులు వచ్చారంటే ఎంతో ఆదరించింది లలిత మొదట్లో

చేస్తూన్న మర్యాద మొదట్లో ఎంతో నచ్చింది సోమశేఖరరావుగారికి. కాని రాను రాను ఆ యింట్లో మర్యాదను పొందటం తన హక్కుగా భావించడం మొదలెట్టాడు. అందువలన తన సౌకర్యాలు చూడటం చంద్రంవాళ్ళ బాధ్యతగా భావించి, లోట్లను వెదకడం మొదలెట్టాడు. ఉద్దేశ్యమే ఉండాలిగాని లోటుపాట్లు కనిపెట్టడం ఏమంత కష్టమని ' 'ఏరా, నెయ్యిలో డాల్డా కలుస్తున్నట్లుందే' అనో, పాలు 'పౌడర్ మిల్క్' అని అనుమానంగా ఉందనో' గునిసాడు. మూడు నెలలున్న తర్వాత ఆ మాటా యీ మాటా అని చంద్రానికీ లలితకూ మధ్య కాస్త గాలి దుమారం లేచేటట్లుచేసి పక్క చుట్టేసుకుని వెళ్ళిపోయాడు.

సోమశేఖరంగారు వెళ్ళిపోయి నప్పటి నుంచీ లలితా చంద్రాల మధ్య ఏదో ఒక రకంగా గొడవ జరుగుతూనే ఉంది.

ఒకరోజున లలిత యింటికి చాలా ఆలస్యంగా వచ్చింది. మామూలుగా ఉంటే చంద్రం ఏమీ అనకపోయేవాడే కాని ఆవాళ కాలేజీలో, తోటి లెక్చరర్లతోటి మాటామాటా వచ్చి మన మన స్పెలాగో అయిపోయింది ఇంటికి ఎంతో తలనొప్పితోటి వచ్చేసాడు. ఇల్లు ఖాళీగా ఉంది. ఇంట్లో వాళ్ళకు ఇష్టంలేని పెళ్ళి చేసుకోవడంవల్ల చెల్లెళ్ళూ, అమ్మా ఒక రకంగా దూరమైపోయారు—ఈ విషయం గుర్తుకొచ్చింది చంద్రానికి

ఇంటికి వచ్చి చతికిలబడ్డాడు కుర్చీలో ఒక్కసారి అమ్మ చెప్పింది జ్ఞాపకానికి వచ్చింది. 'మనకీ సంబంధం వద్దురా బాబూ. నీ అంత చదువుకుని, నీతో బాటు ఉద్యోగం చేస్తూ ఉంటే, నీ బ్రతుకు సుఖం ఉండదురా నాయనా. ఎవరు ఎక్కడ ఉండాలో వాళ్ళు అక్కడ ఉంటేనే గౌరవం!' అని బుజ్జగించి చెప్పింది తండ్రికి గూడా ఏమాత్రం యిష్టంలేదు 'నా ప్రమేయం లేకపోయిన తర్వాత నువ్వు ఏమైపోతే నాకేం' అన్నారాయన చెల్లెళ్ళిద్దరూ మూతి ముడుచుకున్నారు కాని ఆ సమయంలో చంద్రం ధైర్యం మరీ పెరిగి, తీసుకున్న నిర్ణయానికి మరింత కట్టుబడి ఉండేటట్టు చేసింది వాళ్ళ నెదిరించడం ద్వారా తనేదో ఘనకార్యం సాధిస్తూన్నట్లు అనిపించింది ఆ క్షణంలో. రానురాను సన్నగిలుతూన్న మోజూ, యిద్దరి జీవితాలూ వేట్ల కవి సమానాంతర రేఖల లాగ సాగిపోతూ ఉండటమూ, జీవితాన్నొక పరిష్కరించలేని సమస్యలాగ మార్చివేసాయి

ఆరున్నరవుతోంది మిత్రుడు బాబూరావు వచ్చాడు.

'ఏమిటోయ్, అట్లా 'డల్'గా ఉన్నావు?'

'ఏమీ లేదోయ్, కొంచెం తల నొప్పిగా ఉంది.'

'మీ ఆవిడ కాలేజీ నుంచి యింకా రాలేదులాగ ఉంది '

'అవునోయ్. ఆవిడ కార్యక్రమాలు ఆవిడకు ఉంటాయ్ మరి '

'అవును నీ తలనొప్పి నీకు ఉంటుంది.'

చురుక్కుమంది చంద్రానికి. సినిమాకు రమ్మని బాబూరావు ఎంత బలవంత పెట్టినా చంద్రం వెళ్ళలేదు.

'మీ ఆవిడ నీ మీద అలిగినా, నువ్వు మీ ఆవిడ మీద అలిగినా నీకే నష్టం. ఆలోచించుకో, అలిగి లాభంలేదు. కాస్త 'రిఫ్రెషింగ్'గా ఉంటుంది నాతో సినిమాకి రా.'

మరికాస్త చుర్రుమంది బాబూరావు వెళ్ళిపోయాడు. చంద్రం యిల్లు వదలి పెట్టి వెళ్ళదల్చుకోలేదు.

ఎనిమిదౌతూంటే లలిత వచ్చింది యింటికి సువర్ణలత అనే యింకో అమ్మాయితో, ఎంతో ఉషారుగా.

'వీరు మా వారు...యూనివర్సిటీలో ......' అని

యింకా ఏమేమో చెప్పబోతూంటే, చంద్రం ముఖం ముడుచుకున్నాడు. లలితకు కష్టమనిపించింది.

సువర్ణలతకూ, యింకా లలిత యితర స్నేహితులకూ, లలితా చంద్రం వాళ్ళ దాంపత్యం ఆదర్శంగా ఉంటూ వచ్చింది. వాళ్ళ కాలేజీ ప్రణయం ఒక గాథగా చెప్పుకుంటారు ఆమె మిత్రులు. ఈనాడు తను అనుకున్నదానికీ, చూసిన దానికీ సంబంధమేమీ కనిపించక పోవడం తోటి ఎట్లాగో అనిపించింది సువర్ణ లతకు. మనస్సులో జరిగే వాట్లను ముఖంలోకి రానియ్యకుండా మామూలు గానే ఉండటానికి ప్రయత్నించింది. కాస్సేపు ఏదో పిచ్చాపాటీ మాట్లాడి వెళ్ళిపోయింది

సువర్ణలత తమ అన్యోన్యతను అను మానించడం తమ ప్రేమకు అవమానంగా భావించింది లలిత. ఉక్రోషం వచ్చింది, కోపం వచ్చింది. 'ఏమిటి యీ యన రానురాను యిట్లా తయారౌతున్నారు' అనుకుంది. అందువల్ల ఆ రాత్రి ఆ యిద్దరికీ భోజనం సంగతి తలపుకురాలేదు చెరో గ్లాసెడూ మంచినీళ్ళు తాగి పడుకున్నారు.

మర్నాడు పరమ యాంత్రికంగా ఎవరి త్రోవన వాళ్ళు కాలేజీకి వెళ్ళి పోయారు. భోజనం సంగతి ఎవ్వరూ పట్టించుకోలేదు మర్నాడు ప్రొద్దున్న పనిచేసే పిల్ల కాఫీ ఫ్లాస్కులో పోసి హాలులో టీపాయి మీద పెట్టింది, చంద్రానికి కనిపించేటట్లుగా.

'మీ అమ్మగారింకా నిద్ర లేవలే దేమిటీ?' అన్నాడు విసురుగా చంద్రం.

'లేవకేమండి. వారే కాఫీ కలిపిచ్చా రండి' అని వెళ్ళిపోయింది.

'కాఫీ యియ్యడానికిగూడా తీరిక లేనట్టుంది' అని గొణుక్కుంటూ కాఫీ తాగేసాడు.

స్నానం అదీచేసి వచ్చేసరికి పనిచేసే పిల్ల టిఫిన్ కారియర్‌తో అన్నం తీసుకొస్తోంది. దాన్ని చూసేసరికి చంద్రానికి మరీ వళ్ళుమండిపోయింది.

'భోజనానికి రమ్మంటున్నారు' అని పిలుపు వచ్చింది యీలోగా

భోజనంచేస్తూ ఎవ్వరూ మాట్లాడలేదు. చేతులు కడుక్కుంటూ గోడవైపు తిరిగి అన్నాడు చంద్రం—'ఒంట్లో బాగా లేదా' అని

'బాగానే ఉంది' అన్నది, ముభావంగా లలిత

'మరి ?'

'నేనే చెయ్యాలన్న నియమమేదీ లేదుగా. ఇకనుంచి హోటల్నుంచే తెప్పిద్దామనుకుంటున్నాను '

'తీరికలేదా' – ఈసారి యింటి కప్పువైపు చూస్తూ అడిగాడు

'మీ రా ప్రశ్న అడుగుతారని నాకు తెలుసు '

'అయితే యిదంతా కావాలని చేసిందే నన్నమాట'

'మీకు వంట చేసిపెడితేనే గాని వీల్లేదా? నేనేమీ యంత్రాన్ని కాదే? అటు కాలేజీలో పాఠాలు చెప్పి, యిటు మీ సౌకర్యాలు చూసి, అతిధులకు సత్కారాల్లో లోటులేకుండా చూసి... నేనూ మీలాంటి దాన్నేగా? నాకూ విశ్రాంతి అనుభవించాలనీ, నాలుగు చోట్లకూ వెళ్ళి నలుగురితో సరదాగా గడుపుదామని ఉండదూ?'

'ఏమిటి నువ్వనేది లలితా ? నీ వినోదాలకు, కార్యక్రమాలకు ఎవరు అడ్డు వచ్చారు?'

'వినోదాలట! కార్యక్రమాలట! ఎంత పెద్దమాటలండీ? మీకే మాట్లాడటం చేతనౌనులా ఉంది?'

'నిన్ను ఉద్యోగం చెయ్యమని నిర్బంధించలేదే, నేను? ఏదో వేడినీళ్ళకి చన్నీళ్ళు తోడుగా ఉంటుందని నువ్వే చేస్తున్నావుగాని.'

'ఉద్యోగంచేసి నాలుగురాళ్ళు తెస్తూంటేనే మీకు యిట్లా ఉంది నేను మీ డబ్బు మీదే ఆధారపడి ఉంటే యింకా ఎంత చులకనగా చూసే వారో ? మొన్న నా ఫ్రెండు ముందర అంత అవమానించక పోతే మీకు బాగాఅనిపించలేదనుకుంటా?'

'అనవసరంగా దేనికి మాట్లాడతావు లలితా : నీ స్నేహితు లందరికీ కాలక్షేపం యియ్యడానికి నేనేమీ బఫూన్‌ని కాదు. నువ్వెట్లాబడితే అట్లా ఆడే సర్కస్ గుర్రం కాదల్చుకోలేదు'

గడియారం 'తొమ్మిదీ నలభై ' అయిందని చెప్పింది. వాళ్ళు కాలేజీకి వెళ్ళిపోయారు.

లలిత కాలేజీనుంచి తొందరగా తిరిగి వచ్చింది తలనొప్పిగా ఉందని సెలవు

పెట్టి. ఇంటికొచ్చిందన్న మా టే గా ని మళ్ళా కాలేజీకి వెళ్ళాలనిపించింది వెంటనే రిక్షాలో కాలేజీకివెళ్ళి లైబ్రరీలో ఏదో పుస్తకం తిరగేస్తూ కూర్చుంది తెలుగు లెక్చరర్ సుభద్ర పక్కన వచ్చి కూర్చున్నట్లు చాలా సేపటిదాకా తెలియనే తెలియలేదు.

'ఏమిటి నీకు తలనొప్పిగా ఉందటగా లలితా, నీ క్లాసు నన్ను ఎంగేజ్ చెయ్య మన్నారు ప్రిన్సిపాల్‌గారు.' అన్నది సుభద్ర చనువుగా.

'అవును.'

'అవునేమిటి' అరగంటబట్టి చూస్తు న్నాను. పేజీ కదల్లేదు ఏమిటి సంగతి? నాతో చెబుదూ?

'చెప్పేందు కేముం'దని తప్పించు కుంది లలిత

కాని అట్లా ఊరుకునేదిగాదు సుభద్ర 'మా రూముకు రావోయ్' అంటూ 'అప్ లాండ్సు'లో తన రూమ్‌కు తీసుకు వెళ్ళింది. గది అంతా ఎంతో బాగుంది. గది చిన్నదయినా అన్ని హంగులూ అమర్చుకుంది సుభద్ర సుభద్ర పెద్ద ఉన్న దేమీకాదు. జీతంలో తను గడుపు కుంటూ తమ్ముడి చదువుకు డబ్బు పంపి స్తోంది. ఎన్నోరకాలుగా సుఖమయం చేసుకోవచ్చు జీవితాన్ని. ఉద్దేశ్యమే ఉండాలిగాని. 'సుభద్రకన్న నేను ఎక్కువ ఏం బావుకున్నాను పెళ్ళి చేసుకుని' అని పించింది లలితకు పెళ్ళిచేసుకున్న




"ఆయ్ ఆయ్ అందిందండి మీరు పంపిన కథ "

కొత్తలో స్నేహితులందరినీ పెళ్ళిచేసు కోవలసిందేనని ఒప్పించింది. 'చివరకు యింతేనా? తనని వంటింటికీ, పడక గదికీ కట్టేస్తేనేగాని ఆయనకు సంతృప్తిగా ఉండదా? ఈ సంఘర్షణకు అంతె క్కడ?' అని తనని తానే నిశితంగా ప్రశ్నించుకుంది.

ఎన్నిసార్లు అడిగినా ఏమీ చెప్పకపోవ డంతో సుభద్ర అన్నది.

'మరో కప్పు కాఫీ యిచ్చుకోనా.'

'పోనీ మరో రికార్డు పెట్టనా.'

ఇంతలోకే సుభద్ర రోడ్డుమీద పోతూన్న ఎవరోన్నిచూసి నాలిక కొరు క్కుంది. 'ఒక దృశ్యం చూపిస్తాను. నా కేమిస్తావు' అంది

లలిత మాట్లాడలేదు.

'పోనీలే, నా కేమీ యివ్వద్దులే నీను నచ్చితే పిక్చర్ కు తీసుకువెళ్ళు. కిటికీ లోంచి చూడు.'

ఒక్కసారి 'షాక్' తింది లలిత! చంద్రం...ఎవరో అమ్మాయిలతో, కుర్రాళ్ళతో నవ్వుతూ, కేరింతలు కొడుతూన్నట్లు మాట్లాడుతూ దూరంగా యిసుకలో నడుస్తూన్నాడు. తను యిక్కడ సతమత మవుతోంది అక్కడ చంద్రం సరదాగా తిరుగుతున్నాడు. లలిత ఎట్లాగో ఉంటే సుభద్రకు ఏమీ తోచలేదు

లలిత అక్కడనుంచి వెళ్ళిపోయింది. చంద్రం కన్న ముందు యింటికి చేరు కుంది. సాయంత్రానికి గాని రాలేదు చంద్రం.

ఆ రాత్రీ, మరో రాత్రీ ఆ తర్వాత రాత్రులూ ఒకేలాగ గడిచాయి.మరో నెల గడిచింది. ఇద్దరి మధ్యనున్న అంతరమూ అగాధంగా మారింది ప్రతి చిన్న విష యానికీ యిద్దరి మధ్యా వాదం పెరిగి మాటా మాటా అనుకునేదాకా వచ్చారు

ఒక ఆదివారంనాడు యిద్దరూ ఒకళ్ళ కొకళ్ళు ఏదో చెప్పాలని తాపత్రయపడు తూన్నట్లు కనిపించారు

'మీతో మాట్లాడాలి' అంది సూటిగా లలిత

'మాట్లాడు' అన్నాడు అటు పక్కకు తిరిగి.

'చూడండి. మనం యిద్దరం ఒక్క చోటే ఉంటున్నా విడి విడిగానే ఉంటు న్నాం...',

'మనకు ఒకళ్ళంటే ఒకళ్ళకి మొఖం మొత్తిందేమో?'

'మీకు అట్లా అనిపించవచ్చు. నాకు అయోమయంగా ఉంది. ఈ స్థితిలో కాలేజీలో పిల్లలకు పాఠాలు ఏం చెప్పను?'

'చెప్పకు.'

'చేతులు ముడుచుకుని యింట్లో కూర్చోమంటారా? అందుకే ఒక నిర్ణయానికి వచ్చాను.'

'దాని కింత ఉపోద్ఘాతం ఎందుకు? చెప్పేయ్' అన్నాడు. ఆ విషయం తనకు ఎప్పుడో తెలుసు నన్నట్లు

'ఇదుగో' అని కనిపించని వణుకుతో చిన్న చీటీ యిచ్చింది అందులో యిట్లా ఉంది.

'...మనం భార్యా భర్తలలాగ ఎంత కాలం నటించడం? దీనికి పరిష్కారం ఒక్కటే కనిపిస్తోంది అది...'

చంద్రం పిచ్చి చూపులు చూశాడు అటూ యిటూ. కాగితం చింపేశాడు.

'మనం విడిపోదాం అయితే' అని అక్కడనుంచి వెళ్ళిపోయాడు చంద్రం.

అంతకు ముందుదాకా కాస్త అను మానం ఉందేమోగాని, చంద్రం యీ మాట అనేసరికి పాతాళంలోకి దిగి పోయింది అంతర్యం.

'ఇంక కలిసి బ్రతకటం అసంభవం' అని కొరడా పుచ్చుకు కొట్టినట్లనిపించింది. లాభంలేదు తను లలితగా బ్రతకాలి.

చంద్రం భార్యగాకాదు తనకొకవ్యక్తిత్వం ఉంది. దానికి వైవాహిక జీవితం మెరుగు దిద్దనప్పుడు, తను జారిపోకూడదు. నిలబడి ఎదిరించి బ్రతక గల్గాలి

* * *

ఇద్దరూ చెరోపక్కా లాగినప్పుడు బంధం ఎంత పవిత్రమైనదైనా తెగక మానదు. ఆలోచించుకున్నా మనుకొని యిద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు. కోర్టువారికి విడాకుల దరఖాస్తు యిచ్చారు— మర్నాడు దసరా పండగనగా

# 3

కొంతకాలం మామూలుగానే జరిగింది లలితా చంద్రాల జీవితం గాడిలో పడి వెళ్ళిపోతోంది. ఇద్దరూ ఒంటరిగా, చప్పగా బతికేస్తున్నారు. బాధను మర్చిపోవడం కోసం సినిమాలూ, స్నేహితులూ నిత్య జీవితంలో భాగమైపోయాయి రోజులు గడుస్తూన్నకొద్దీ ఒకళ్ళ తప్పులు మరొకళ్ళకి చాలా పెద్దవిగా కనిపిస్తున్నాయి విడిపోవడం మంచిదేనన్న భావమూ కలుగుతోంది 'కలిసి ఉంటేనే గాని జీవితానికి సార్థక్యం లేదన్న' విప్పిచెప్పలేని నిజమూ వెన్ను తట్టి చెబుతోంది

కాలేజీ జీవితం యిద్దరికీ వెగటు పుడుతోంది. మునుపు తమను ఎంతో అభిమానంగా చూసే వాళ్ళందరూ యిప్పుడు అదోలాగ చూస్తున్నారు వీళ్ళిద్దరూ ఏదో మహాపరాధం చేసినట్లుగా భావిస్తున్నారు

ఎవరి బ్రతుకు వాళ్ళని బ్రతకనివ్వదు లోకం అందరి విషయాలూ అందరికీ కావాలి—కేవలం ప్రేక్షక దృక్పధం తోటి

ఏమీ తోచక అమ్మా నాన్నా ఉన్న ఊరు అనకాపల్లి వెళ్ళాడు చంద్రం

'అన్నియ్యా, ఏదినేది'' అన్నారు చెల్లెళ్ళు, వాళ్ళకింత ఆపేక్ష ఎప్పుడు పుట్టుకొచ్చిందో మరి '

చంద్రం యింట్లోవాళ్ళు చంద్రం చేసిన పనికి సంతోషించలేదు సరికదా చివాట్లేశారు కూడాను

'చంద్రం ' పెళ్ళంటే బొమ్మలాట అనుకున్నావా నాయనా, వెయ్యేళ్ళ పంటరా, పెళ్ళంటే', అంది చంద్రం వాళ్ళమ్మ కొంతమ్మగారు. భార్యాభర్తల బాంధవ్యాలు, తల్లితండ్రుల రక్త సంబంధాలూ, తెచ్చిపెట్టుకున్న సంస్కారాలన్నిటికన్న బలీయమైన వవటంవల్ల, ఆవిడ కాసమయంలో వాళ్ళది రిజిష్టర్డు మేరేజీ అనీ, లలిత చదువుకుని ఉద్యోగం చేస్తూన్నదనీ తట్టనేలేదు !

చుట్ట కాలుస్తూ, పేపరు చదువుకుంటూన్న రామనాధంగారిని చూస్తూ అన్నది ఆవిడ— 'ఏదో కుర్రతనం. మాటా మాటా అనుకున్నట్లున్నారు. మనం వెళ్ళి తీసుకురావాలండి కోడల్ని మిమ్మల్నే... బయలుదేరండి...'

వీళ్ళిద్దర్నీ చూస్తున్న చంద్రానికి నిజంగా మతిపోయింది ' ★